
సాక్షి
నిజామాబాద్
శుక్రవారం : 31 : మార్చి : 2023



● అంగరంగ వైభవంగా..



నిజామాబాద్‌లోని ఖిల్లా రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా రాముల వారికి ముత్యాల తలంబ్రాలు పోస్తున్న పండితుడు



ఖిల్లా రామాలయంలో సీతమ్మ విగ్రహానికి తాళిబొట్టు ధరింపజేస్తున్న వేదపండితుడు



డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు

దేవదేవుడి కల్యాణాన్ని భక్తజనం కనులారా వీక్షించి పులకించిపోయారు. అభిజిత్ లగ్నంలో జగన్మాత సీతమ్మ మెడలో శ్రీరామచంద్రుడు మాంగళ్యధారణ చేశారు. జిల్లావ్యాప్తంగా గురువారం రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని ఖిల్లా రామాలయం, సుభాష్‌నగర్ రామాలయం, గాజుల్‌పేట్‌లోని బడా రాంమందిర్, డిచ్‌పల్లిలోని ఖిల్లా రామాలయం, బోధన్‌లోని శక్కర్‌నగర్ రామాలయంలో ఆర్మూర్‌లోని నవనాథుల సిద్దుల గుట్టపై, పోచంపాడ్‌లోని కోదండ రామాలయాల్లో రాములోరి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. సిరికొండ లొంక రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే నందిపేట కేదారీశ్వర ఆశ్రమంలోనూ సీతారాముల కల్యాణాన్ని మంగిరాములు మహరాజ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా ఆలయాల్లో కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించారు. నగర శివారులోని మాధవనగర్ సాయిబాబా ఆలయం వద్ద ఆర్వోబీ పనులు జరుగుతున్న దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– వివరాలు లోపలి పేజీల్లో..

న్యూస్‌రీల్

నేడు సీపీ పదవీ విరమణ

- జిల్లా కేంద్రానికి ఐజీ చంద్రశేఖర్ రెడ్డి రాక
- కామారెడ్డి ఎస్పీకి అదనపు బాధ్యతలు?



ఖలీల్‌వాడి: నేడు సీ పీ నాగరాజు పదవీ విరమణ చేయనున్నారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ రేంజ్ ఇన్‌చార్జి ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి రానున్నట్లు తెలిసింది. జిల్లా సీపీగా కెఆర్ నాగరాజు 2021 డిసెంబర్ 26న బాధ్యతలు స్వీకరించారు. సీపీ పదవీవిరమణ చేయడంతో నిజామాబాద్ సీపీగా కామారెడ్డి ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తారనే ప్రచారం పోలీస్‌వర్గాల్లో జరుగుతోంది. లేకుంటే శుక్రవారం రాత్రి వరకు కొత్త సీపీ ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నట్లు సమాచారం. ఇప్పటికే నలుగురు పేర్లు తెరపైకి రాగా హైదరాబాద్‌లోని వెస్ట్‌జోన్ పరిధిలో పనిచేసే ఐపీఎస్ అధికారి జిల్లాకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి : నేడు నిజామాబాద్ రీజియన్‌లో డయల్ యువర్ ఆర్టీసీ ప్రోగ్రాం శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎం ఉషాదేవి తెలిపారు. ఉమ్మడి జిల్లాల ప్రయాణికులు ఆయా నంబర్లకు ఫోన్‌చేసి తమ సమస్యలను, సూచనలను తెలపాలన్నారు.

రీజినల్ మేనేజర్, నిజామాబాద్	9959226011
డిపో మేనేజర్, ఆర్మూర్	9959226019
డిపో మేనేజర్, బోధన్	9959226001
డిపో మేనేజర్, నిజామాబాద్-1	9959226016
డిపో మేనేజర్, నిజామాబాద్-2	9959226017
డిపో మేనేజర్, కామారెడ్డి	9959226018
డిపో మేనేజర్, బాన్సువాడ	9959226020

అధ్యాపకులు రిపోర్ట్ చేయాలి

నిజామాబాద్‌అర్బన్ : ఇంటర్ మూల్యాంకన కేంద్రంలో విధులు నిర్వర్తించే అధ్యాపకులు రిపోర్టు చేయాలని ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్న మొదటి స్పెల్ ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకన విధుల ఆర్డర్ కాపీలు వచ్చిన ఉమ్మడి జిల్లాలోని ప్రతి అధ్యాపకుడు వెంటనే రిపోర్ట్ చేయాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, గణిత శాస్త్రం, పౌరశాస్త్రంకు సంబంధించిన మూల్యాంకనానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం మూల్యాంకన విధులకు హాజరుకాని అధ్యాపకులపై, గతంలో హాజరుకాని అధ్యాపకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్తరాధికారిగా రాంచంద్రస్వామి



మాట్లాడుతున్న పీఠాధిపతులు

సాక్షిప్రతినిధి, నిజామాబాద్ : నగరంలోని పెద్ద రాంమందిర్ మఠం ఉత్తరాధికారిగా రాంచంద్రస్వామి గురువారం ప్రమాణస్వీకారం చేశారు. మహారాష్ట్రలో సమర్థరామదాసు స్థాపించిన సజ్జన్‌ఘడ్ పీఠాధిపతి యోగేష్ బువ ముఖ్య అతిథిగా హాజరై రామచంద్ర స్వామితో ప్రమాణస్వీకారం చేయించారు. ప్రస్తుత పీఠాధిపతిగా దినకర్ స్వామి కొనసాగుతున్నారు. దినకర్‌స్వామి తదనంతరం ప్రస్తుతం కొనసాగుతున్న రాంచంద్రస్వామి పీఠాధిపతిగా వ్యవహరిస్తారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని పెద్దరాంమందిర్‌లో శ్రీరాముని జనన మహోత్సవాన్ని నిర్వహించారు. దేశవ్యాప్తంగా శ్రీరా మ నవమి సందర్భంగా సీతారాముని కల్యాణం చే స్తా రు. అయితే జిల్లాకేంద్రంలోని పెద్దరామందిర్‌లో మాత్రం కల్యాణానికి బదులు శ్రీరా ముని జనన మహోత్సవం నిర్వహించ డం ప్రత్యేకత. కాగా శుక్రవారం ఈ ఆలయంలో అన్నదానం చేయనున్నట్లు బాధ్యులు అజయ్‌సంగ్వీ, వెంకట్‌రావ్ కులకర్ణి తెలిపారు.



పల్లెబాట పట్టిన కరెంటోళ్లు..

- ఏఈ, ఏడీఈ, డీఈలకు ఒక్కో గ్రామం కేటాయింపు
- ప్రత్యేక సర్వే ద్వారా 75 గ్రామాల్లో పనుల గుర్తింపు
- త్వరలోనే పనులకు శ్రీకారం



నిజామాబాద్ నాగారం : పల్లెల్లో విద్యుత్ సమస్యలు కొలిక్కి వచ్చే అవకాశాలున్నాయి. సంస్థ అధికారులు నేరుగా వినియోగదారుల వద్దకే రానున్నారు. ఆయా పల్లెల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా సర్వే చేపట్టారు. జిల్లాలోని ఏఈ, ఏడీఈ, డీఈలు సెక్షన్లలో ఉన్న గ్రామాలను దత్తత తీసుకుని విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటికే 75 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. అతి త్వరలోనే పనులు ప్రక్రియ ప్రారంభం కానుంది.

సమస్యల్లేకుండా చూడాలని..

జిల్లాలో నాలుగు డివిజన్లు ఉన్నాయి. బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ డివిజన్, నిజామాబాద్ రూరల్ ఉండగా, నాలుగు సబ్ డివిజన్లు అంటే 14 మంది ఏడీఈలు, మొత్తం 50 సెక్షన్‌లకు ఏఈలున్నారు. అయితే విద్యుత్ సీఎండీ గోపాల్‌రావు ఆదేశాల మేరకు పల్లెలో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. ఇందుకు గాను నలుగురు డీఈలు, 14మంది ఏడీఈలు, 50 మంది ఏఈలు డివిజన్లు, సబ్‌డివిజన్, సెక్షన్ పరిధిలో ఉన్న ఒక్కో అధికారి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసుకున్నారు. ఇప్పటికే ఎంపిక చేసుకున్న గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేశారు. ఇప్పటికే జిల్లాలో 75 గ్రామాల్లో పనులు గుర్తించారు. నిధుల రాగానే పనులు చేపట్టనున్నారు.

మున్సిపాలిటీలో కూడా..

నగరంలోని ముగ్గురు ఏడీఈలు, తొమ్మిది మంది ఏఈలున్నారు. నగరంలో ఉన్న ఆరు జోన్ల పరిధిలోని 60 డివిజన్లలో ఉన్న కాలనీల్లో ఒక్కో కాలనీని అధికారులు దత్తత తీసుకున్నారు. పల్లెలో మాదిరిగానే, పట్టణాల్లో కూడా సమస్యలు పరిష్కరించనున్నారు.

సంస్థ ద్వారా చేసే పనులివి..

అధికారులు దత్తత తీసుకున్న గ్రామాల్లో డిపార్ట్‌మెంట్ ద్వారా కొన్ని పనులు చేస్తారు. ఇందులో లూస్‌లైన్లు, ఆగిపోయిన మీటర్లు, సపోర్ట్ వైర్లు తదితర ఉన్నాయి. ఇవి విద్యుత్ అధికారులు సిబ్బంది ద్వారా పనులు చేయిస్తారు.

కాంట్రాక్టర్ ద్వారా..

ఆయా గ్రామాల్లో విరిగిన, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, మిడిల్ పోల్స్, స్ట్రీట్‌లైట్, రోడ్డు క్రాసింగ్‌లో ఉంటే, ట్రాన్స్‌ఫార్మర్లకు గద్దెలు నిర్మించడం తదితర ఉన్నాయి. నిధులు రాగానే ఈ పనులు ప్రారంభించనున్నారు.

ఆన్‌లైన్ పేమెంట్స్‌పై అవగాహన

జిల్లాలో ప్రస్తుతం 75గ్రామాల్లో కచ్చితంగా ఆన్‌లైన్ ద్వారానే విద్యుత్ బిల్లులు చెల్లించేలా వినియోగదారులకు అవగాహన కల్పించడం జరుగుతుంది. 100శాతం అందరు ఆన్‌లైన్‌లో చెల్లించేలా ప్రోత్సహిస్తారు. అలాగే సిటిజన్ చార్ట్ ప్రతి గ్రామ పంచాయతీలో ఏర్పాటు, సిబ్బంది, అధికారుల ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది.

“ మెరుగైన సేవల కోసమే..

జిల్లాలో ఇప్పటికే 75 గ్రామాలను డీఈ, ఏడీఈ, ఏఈలు దత్తత తీసుకున్నారు. అందులో నెలకొన్న సమస్యలకు సర్వే పూర్తి చేశారు. విద్యుత్ సిబ్బంది, అధికారుల ద్వారా ఏప్రిల్‌లో పనులు చేస్తారు. కాంట్రాక్టర్ ద్వారా చేసే పనులకు నిధులు రాగానే ప్రారంభిస్తారు. ప్రతి గ్రామాన్ని 100 శాతం ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రవీందర్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ

భానుడి భగభగ


- 38.9 డిగ్రీల సెల్సియస్ నమోదు..
- క్రమంగా పెరుగుతున్న పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు



సుభాష్‌నగర్ : జిల్లాలో భానుడు భగభగ మండుతున్నాడు. వారం పదిరోజులుగా పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. గురువారం 38.9 డిగ్రీలుగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ సీజన్‌లో ఇదే అత్యధికం. మార్చి ముగిసేనాటికి 40 డిగ్రీలకుపైనే ఉంటుందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25.4 డిగ్రీలుగా నమోదైంది. రాత్రివేళల్లో కూడా ఉష్ణోగ్రతలు పెరగడం మూలంగానే ఉక్కపోతలు ఎక్కువయ్యాయి. గాలివేగం తక్కువగా ఉండటం వల్లే ఉక్కపోతతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. మార్చి రెండోవారంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించినా.. కొన్ని మండలాల్లో మినహా జిల్లాపై వర్ష ప్రభావం పెద్దగా చూపలేదు. గాలులు వీయడంతో వాతావరణం కొంత చల్లగా మారినప్పటికీ.. గత వారం రోజుల నుంచి ఎండలు మండుతున్నాయి. ఉదయం 11 దాటితే బయటికి వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. సాయంత్రం 5 తర్వాతే బయటికి వస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో సగటు ఉష్ణోగ్రతలు 42 నుంచి 45 డిగ్రీల వరకు ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. 2003లో జిల్లా చరిత్రలో అత్యధికంగా 47.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, గతేడాది మే రెండోవారంలో అత్యధికంగా 45.9 డిగ్రీలుగా నమోదైంది.

ఉక్కపోతతో ఇబ్బందులు..

ఎండలు ముదరడంతో ఉక్కపోతలు పెరిగాయి. గాలివేగం తక్కువగా ఉండటం, కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు కావడం ఉక్కపోతలకు కారణమని అధికారులు పేర్కొన్నారు.



ఐదు రోజులుగా నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు

ప్రాజెక్టులు అభివృద్ధి చెందుతున్నాయ్



కాకతీయ కాలువపై నిర్మించే వంతెనకు శంకు స్థాపన చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక నీటి ప్రాజెక్టులు అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మెండోరా మండలం పోచంపాడ్‌లో పోచంపాడ్, సోన్‌పేట్ గ్రామాల మధ్య నూతన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక అభివృద్ధికి నిదర్శనం శ్రీరాంసాగర్ ప్రాజెక్టేనన్నారు. కాకతీయ కాలువ వంతెనపై దేశంలో ఎక్కడాలేని విధంగా కొత్త టెక్నాలజీతో వంతెన నిర్మిస్తున్నామన్నారు. రూ. 1.35 కోట్ల నిధులను సీఎం కేసీఆర్ స్వయంగా మంజూరు చేశారన్నారు. వంతెన నిర్మాణాన్ని మూడు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. కాకతీయ కాలువపై వంతెన నిర్మాణానికి కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బురుకుల సుకన్య, జెడ్పీటీసీ తలారి గంగాధర్, సర్పంచ్‌లు మిస్బా, ప్రకాశ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ, ఎంపీటీసీ సభ్యుడు జాన్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు బాబా, ప్రాజెక్ట్ ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పన్ను వసూళ్లు

- 216 జీపీల్లో వందశాతం పూర్తి
- ఇంటి పన్ను వసూళ్లు 86.54 శాతం
- మిగిలిన జీపీల్లో వసూళ్ల కోసం అధికారుల ప్రత్యేక డ్రైవ్
- రూ. 25.20 కోట్ల పన్నులకు గాను రూ. 21.80 కోట్ల వసూళ్లు



మోర్తాడ్(బాల్కొండ): జిల్లాలో ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యం వంద శాతానికి చేరువలో ఉంది. 530 పంచాయతీలకు గాను 216 జీపీల్లో వంద శాతం పన్నులు వసూలు చేశారు. మరో 314 పంచాయతీల్లో 85 శాతానికి పైగా ఇంటి పన్నులు వసూలు చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరం నేటితో ముగిసిపోనుండగా ఈ ఏడాదికి సంబంధించిన ఇంటి పన్నులు ఇంకా వసూలు చేయాల్సి ఉంది. ఇంటి పన్నుల వసూళ్లలో వెనుకబడిన జీపీల్లో స్పెషల్‌డ్రైవ్‌ను నిర్వహించారు. అయినప్పటికీ ఆర్థిక ఏడాది ముగిసేలోపు ఇంకా కొంత బకాయిలు ఉండటంతో పూర్తిస్థాయిలో వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్‌ను మరో వారం రోజుల పాటు పొడిగించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. జిల్లాలో ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యం రూ. 25,20,11,226 ఉంటే ఇందులో రూ. 21,80,82,974ను వసూలు చేశారు. అంటే జిల్లాలో 86.54 శాతం ఇంటి పన్నులను వసూలు చేసినట్లు వెల్లడవుతుంది. మరో 13.46 శాతం ఇంటి పన్నులను ఏప్రిల్ మొదటి వారంలోనే పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇంటి పన్నుల వసూళ్లలో వెనుకంజలో ఉన్న జీపీకి సంబంధించి సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఉద్యోగులపై చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. 2018లో పంచాయతీ రాజ్ చట్టంను సవరించకముందు ఇంటి పన్నుల బకాయిలు అనేకం పేరుకుపోయేవి. ఇప్పుడా పరిస్థితి లేదు.

“ వంద శాతం వసూలు చేస్తాం

వంద శాతం ఇంటి పన్నులు వసూలు కాని గ్రామాల్లో ప్రత్యేక బృందాలతో వారం, పది రోజుల వ్యవధిలోనే వంద శాతం వసూళ్లను పూర్తిచేస్తాం. ప్రజల సహకారం బాగుంది. బకాయిలు చెల్లించని వారు పంచాయతీలకు వెళ్లి ఇంటి పన్నులను చెల్లించి వంద శాతం వసూళ్లకు సహకరించాలి.

– డాక్టర్ జయసుధ, డీపీవో

డివిజన్లవారీగా పన్ను వసూళ్లు.. (రూపాయలు)

డివిజన్	పంచాయతీలు	లక్ష్యం	వసూలు చేసింది	బకాయిలు	శాతం
ఆర్మూర్	177	11,92,68,71	10,35,74,366	1,56,94,344	86.84
బోధన్	142	5,12,24,977	4,37,09,340	75,15,637	85.33
నిజామాబాద్	211	8,15,17,539	7,07,99,268	1,07,18,271	86.85
మొత్తం	530	25,20,11,226	21,80,82,974	3,39,28,252	86.54

తలంబ్రాలకు భక్తుల స్పందన భేష్



భక్తులకు రసీదు అందజేస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి

డిచ్‌పల్లి : భక్తుల కొంగుబంగారం భద్రాద్రి సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలను ఇంటివద్దకే అందించేందుకు టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ (కార్గో) ద్వారా ప్రారంభించిన సేవలకు భక్తుల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తుందని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంపై ఆర్టీసీ గురువారం తలంబ్రాల బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. స్వామి వారి కల్యాణ వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఈ కౌంటర్ వద్దకు వచ్చి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేవలం రూ.116 చెల్లిస్తే భద్రాద్రి సీతారామచంద్రస్వామి వారి కల్యాణ తలంబ్రాలు మీ ఇంటి వద్దే అందుకునే అవకాశం ఆర్టీసీ కల్పించిందన్నారు. కల్యాణ తలంబ్రాలు బుక్ చేసుకున్న భక్తులకు రసీదులు అందజేశారు. 150 మంది భక్తులు రూ.116 చొప్పున మొత్తం రూ.17,400 చెల్లించినట్లు కార్గో ఇన్‌చార్జి మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్లు చందర్, దాసు పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి కల్యాణం

జిల్లాలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. పట్టణాలు, పల్లెల్లోని రామాలయాలు, హనుమాన్ ఆలయాల్లో రాములోరి కల్యాణం జరిపించారు. సకలగుణ వల్లభుడికి సీతాదేవిని ఇచ్చి పండితులు వివాహం చేశారు. జగదభిరాముడి కల్యాణం తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.



నిజామాబాద్‌లోని ఖిల్లా రామాలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



సుభాష్‌నగర్ రామాలయంలో తాళిబొట్టు చూపుతున్న పండితుడు



ఖిల్లాడిచ్‌పల్లిలో వేడుకల్లో పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



ఖిల్లా రామాలయంలో భక్తుల రద్దీ



సుభాష్‌నగర్ రామాలయంలో స్వామివారు..



ఆంధ్రనగర్‌లో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు



కోటగిరిలో హాజరైన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు



పోచంపాడ్‌లో కల్యాణ వేడుకల్లో మంత్రి ప్రశాంత్‌రెడ్డి దంపతులు



ఆర్మూర్‌లో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి దంపతులు

బెట్టింగ్ భూతానికి బలి!

- ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసవుతున్న యువత
- అంధకారమవుతున్న జీవితాలు
- అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటున్న వైనం
- రోడ్డున పడుతున్న కుటుంబాలు



నందిపేట్: కోట్లకు పడగెత్తాలనే అత్యాశతో ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడుతున్న యువకుల జీవితాలు అంధకారమవుతున్నాయి. బంధువులు, స్నేహితుల వద్ద చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు పరారవుతున్నారు. దీంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇలాంటి సంఘటనలు నందిపేట, డొంకేశ్వర్ మండలాల్లో వెలుగు చూస్తున్నాయి.

పరారీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు

భావితరానికి సన్మార్గం చూపాల్సిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అత్యాశకు పోయి ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడి రూ. 3 కోట్ల బాకీలు చేసి పరారయ్యాడు. నందిపేటకు చెందిన ఓ ఉపాధ్యాయుడు కామారెడ్డి జిల్లా సదాశివనగర్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను వడ్డీ వ్యాపారం సైతం చేసేవాడు. బెట్టింగులకు అలవాటు పడి మోసానికి గురవుతు వచ్చాడు. ముందుగా తన తండ్రి నుండి రూ. 70 లక్షలు తీసుకుని వ్యాపారం చేస్తానని నమ్మించాడు. తర్వాత తన తండ్రి సోదరులైన ఇద్దరి నుంచి రూ.55 లక్షలు తీసుకున్నాడు. అంతే కాకుండా తోటి ఉపాధ్యాయుల వద్ద, స్నేహితుల వద్ద లక్షల రూపాయలు బాకీ చేశాడు. సహ ఉపాద్యాయురాలైన ఓ మహిళా రూ. 15 లక్షలతో పాటు ఇంటి కాగితాలు ఇచ్చినట్లు సమచారం. అందరి దగ్గర సుమారు రూ. 3 కోట్ల పై చిలుకు బాకీ తీసుకుని బెట్టింగులో పోగోట్టుకుని ఏమి చేయాలో తెలియక పరారయ్యాడు.

మరో యువకుడి ఆత్మహత్య

ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడి రూ. 2 కోట్ల పైచిలుకు బాకీలు చేసి నందిపేటకు చెందిన ఓ యువకుడు అప్పులు తీర్చలేక ఆరునెలల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అలాగే నందిపేటలోని రాజనగర్ కాలనీకి చెందిన మరో యువకుడు రూ.2 కోట్ల అప్పు చేశాడు బకాయిలు తీర్చమని బాకీలు ఇచ్చిన వారు వెంటపడడంతో పరారయ్యాడు. పరారీలో ఉన్న అతనిని పట్టుకు వచ్చిన తండ్రి తనకు ఉన్న పొలాలను, ప్లాట్లను అమ్మి అప్పులు తీర్చాడు.

బర్త్‌డే అని చెప్పి..

డొంకేశ్వర్ మండలంలోని గంగసముందర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగులో రూ. 70 లక్షల పైచిలుకు పోగోట్టుకున్నాడు. అంతే కాకుండా హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువుతున్న తన బంధువుల అమ్మాయిల దగ్గర నుంచి తన బర్త్‌డే అని బంగారు గొలుసులు తీసుకొని అమ్ముకున్నట్లు సమాచారం.

తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడుతూ మోసాలు గురవుతున్న యువకుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. యువకులు చేసిన పాపాలకు తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. తన పిల్లలు చేసిన బాకీలు తీర్చే పరిస్థితి లేక తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి నెలకొంది. పైసా పైసా పోగు చేసి డబ్బులు పెరుగుతాయనే ఆశతో అప్పులు ఇచ్చిన వారు సైతం తిరిగి రాక ఇబ్బందులు పడుతున్నారు.

అత్యాశతో బెట్టింగులు



అత్యాశతో యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. కరోనా కాలంలో లాక్‌డౌన్ సమయంలో విద్యార్థులు ఆన్‌లైన్ తరగతుల కోసం స్మార్టుఫోన్లకు అలవాటు పడిపోయారు. ఫోన్లలో వచ్చిన కొత్త కొత్త ఆప్‌లకు అలవాటుపడి బెట్టింగులకు పాల్పడి మోసాలకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రులు సైతం పట్టించుకోవడం లేదు. ఆన్‌లైన్ ఆప్‌ల ద్వారా మోసపోకుండా పోలిసుల కళాబృందం వారి అవగాహాన కల్పిస్తున్నాం. మోసపోయివారు ఎవరైన పిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– శ్రీకాంత్, నందిపేట ఎస్సై









గంగరమందలో చిరుత పిల్లల కలకలం

- అన్వేషించిన ఫారెస్టు అధికారులు
- గండుపిల్లిగా అనుమానం





చిరుతగా భావించి రైతు తీసిన చిత్రం,పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

మాక్లూర్ : మండలంలోని గంగరమంధ గ్రామ శివారు వ్యవసాయ పొలాల్లో గురువారం ఉదయం ఓ రైతుకు చిరుత పిల్ల కనిపించడంతో గ్రామంలో భయాందోళనలు చెలరేగాయి. రైతు రాజేశ్ తన పొలంలో గడ్డి కోస్తుండగా కొద్దిదూరంలో నుంచి చిరుత పిల్ల పరిగెత్తగా గమనించి వీడియో తీసి గ్రామస్తులకు తెలియజేశారు. సర్పంచ్ వెంటనే ఈ విషయాన్ని ఫారెస్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి అశోక్‌కుమార్, బీట్ అధికారి శ్రీనివాస్ గ్రామానికి చేరుకోని రైతులతో కలిసి మూడుగంటలకు పైగా అన్వేషించగా చిరుత పులి, పిల్లల ఆనవాళ్లు లభించలేదు. గండు పిల్లి కూడా దూరం నుంచి చూస్తే చిరుత మాదిరిగానే కన్పిస్తుందని ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారులు పేర్కొన్నారు. ఏడాదికాలంగా చిరుత పిల్లలు ఈ ప్రాంతంలో తిరుగుతున్నాయని గ్రామస్తులు పేర్కొనడంలో వాస్తవం కనిపించడం లేదన్నారు. చిరుత ఉండి ఉంటే పశువులు, మేకలు, కుక్కలపై దాడి చేసేదన్నారు. ఏదేమైనప్పటకీ రైతులు, పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రసాద్, భూమయ్య మరి కొందరు రైతులు ఫారెస్ట్ అధికారుల వెంట ఉన్నారు.

బియ్యం గింజలపై 'శ్రీరామ్'





నిజామాబాద్ సిటీ: నగరంలోని ముబారక్‌నగర్‌కు చెందిన బిల్ల బాబు శ్రీరామనవమి సందర్భంగా 2,01,400 బియ్యం గింజలపై శ్రీరామ్ అని రాసి హైదరాబాదులోని కూకట్‌పల్లి రామాలయంలో గురువారం అందజేశారు. ప్రతి ఏడాది ఎంతో శ్రద్ధ, ఓపికతో బియ్యం గింజలపై శ్రీరామ్ అని రాస్తూ శ్రీరామనవమి సందర్భంగా వివిధ ఆలయాలకు తలంబ్రాల రూపంలో బిల్ల బాబు అందజేస్తూ వస్తున్నారు. 2018లో 1,61,000 బియ్యం గింజలపై శ్రీరాం అని రాసి నిజామాబాద్‌లోని రఘునాథ ఆలయంలో అందజేశారు. 2019లో 1,56,000 బియ్యం గింజలపై శ్రీరాం అని సుభాష్‌నగర్ రామాలయంలో అందజేశారు. గతేడాది డిచ్‌పల్లి రామాలయంలో 1,61,000 బియ్యం గింజలపై శ్రీరాం అని రాసి అందజేశారు.

శోభాయాత్రలో అపశ్రుతి

- ట్రాక్టర్‌కు విద్యుత్ తీగ తగిలి ఇద్దరికి గాయాలు





చికిత్స పొందుతున్న రాజు, శ్రీనివాస్

నందిపేట్: నందిపేటలో రామ్‌నగర్ కాలనీకి చెందిన శ్రీరామ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రాముడి శోభాయాత్రలో అపశ్రుతి నెలకొంది. ట్రాక్టర్‌కు రాముడి ప్రతిమతో కట్టిన ఫ్లెక్సీ ఫ్రేమ్‌కు ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైరు తగలడంతో ట్రాక్టర్‌కు విద్యుత్ సరఫరా అయింది. దీంతో ట్రాక్టర్‌లో కూర్చున్న పిల్లలతో పాటు యువకులు కరెంట్‌షాక్‌కు గురయ్యారు. ఈ విషయం గమనించిన ట్రాక్టర్‌లో ఉన్న యువకుడు పిల్లలను బయటకు విసిరేశాడు. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో ఉన్న శ్రీనివాస్, పెయింటర్ రాజుతో పాటు పది సంవత్సరాల బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. ట్రాక్టర్ మూడు టైర్లు కాలిపోయాయి. ట్రాక్టర్‌పై ప్లాస్టిక్ టార్పాలిన్ పరచి ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని విద్యుత్‌శాఖ సిబ్బంది తెలిపారు. గాయపడిన బాధితులను స్థానిక ఆస్పత్రికి తరలించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

సుభాష్‌నగర్: నిరుద్యోగ యువతకు టాటాస్త్రైవ్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సెంటర్ ఇన్‌చార్జి ఎండీ పాష ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్, బీపీఓ, రిటైల్, నర్సింగ్ కోర్సుల్లో శిక్షణనిస్తామన్నారు. ఉచిత హాస్టల్ వసతి ఉంటుందని పేర్కొన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై, డిగ్రీ వరకు చదువుకున్న వారు అర్హులని, 18 నుంచి 27 ఏళ్లలోపు యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8328368554, 8074306410 నంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

రేపు సైకిల్ ర్యాలీ

ఖలీల్‌వాడి: ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శనివారం సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లా సైక్లింగ్ సంఘం సహకారంతో ఏప్రిల్ 1న ఉదయం 7 గంటలకు జిల్లా కోర్టులో సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



దీపిక



శివాని



శశిధర్



సాయిశివ

నిజామాబాద్‌నాగారం/కమ్మర్‌పల్లి: జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు జిల్లా నుంచి క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి టోర్నీ జరగనుంది. ఈనెల 26 నుంచి 30 వరకు హైదరాబాదులో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపిక కావటంతో వారినిఇ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, సలహాదారులు ఎన్వీ హనుమంత్ రెడ్డి, తదితరులు అభినందించారు.

ఎంపికైన క్రీడాకారులు..

ఉమ్మడి జిల్లా నుంచి శశిధర్(గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, కామారెడ్డి), సాయి శివ (గిరిరాజ్ కాలేజ్ నిజామాబాద్), శివాని(గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, మోర్తాడ్), దీపిక (గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, ఉప్లూర్) ఎంపికయ్యారు.

కొత్తపల్లి శివారులో చిరుత సంచారం!



రుద్రూర్: కోటగిరి మండలం కొత్తపల్లి శివారులో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు భయాందోళన చెందుతున్నా రు. గుట్ట ప్రాంతంలో మేత కోసం వెళ్లిన మందపై చిరుత దాడి చేయగా గురువారం సాయంత్రం ఒక మేక మృతి చెందింది.

రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో బుధవారం రాత్రి దొంగలు రెండు 25కేవీ ట్రాన్స్‌ఫార్మలను ధ్వంసం చేసి కాపర్ వైర్లను ఎత్తుకెళ్లారు. రైతులు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించగ ఘటన స్థలాన్ని ఏడీఈ శ్రీధర్, ఏఈ మనీషా, లైన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ పరిశీలించారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి మృత్యువాత

మాచారెడ్డి: చేపల వేటకు వెళ్లి ఫిట్స్ రావడంతో నీట మునిగి ఒకరు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన గురువారం మండలంలోని ఎల్లంపేటలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లపు మల్లయ్య(30) గ్రామ శివారులోని మైసమ్మ చెరువుకు మరో వ్యక్తితో కలిసి చేపల వేటకు వెళ్లాడు. చెరువులోకి దిగగానే మల్లయ్యకు ఫిట్స్ వచ్చి నీట మునిగాడు. మరో వ్యక్తి కాపాడే యత్నం చేసినప్పటికి ఫలితం లేకుండా పోయింది. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కరెంట్ షాక్‌తో ఒకరి మృతి



పయ్యావుల స్వామి(ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): విద్యుత్ షాక్‌తో మండల కేంద్రానికి చెందిన పయ్యావుల స్వామి(44) గురువారం మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మరో రైతుకు చెందిన వ్యవసాయ బోరు మోటారు చెడిపోవడంతో మరమ్మతు చేయించి గురువారం ఉదయం చుట్టుపక్కల రైతులు కలిసి మోటారును దించారు. అనంతరం మోటారును స్టార్ట్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు స్వామి విద్యుత్తు షాక్‌కు గురై కింద పడిపోయాడు. తోటి రైతులు వెంటనే మండల కేంద్రానికి తరలించి ఓ ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో చేర్పించారు. పరిశీలించిన వైద్యుడు కామారెడ్డికి తరలించాలని సూచించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతుడి కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ..

ఖలీల్‌వాడి: ఇందల్వాయి మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్ద గల ఎల్ సీ గేటు వద్ద గుర్తు తెలియని మహిళ అనుమానాస్పదంగా మృతి చెందినట్లు రైల్వే ఎస్సై ప్రణయ్ గురువారం తెలిపారు. ఆమెకు 40 ఏళ్ల ఉంటాయని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిస్తే రైల్వే పోలీసులను ఆశ్రయించాలన్నారు.

పాముకాటుతో చిన్నారి మృతి



అమూల్య(ఫైల్)

ఇందల్వాయి: నాగుపాము కా టుతో నాలుగేళ్ల పసికందు మృతిచెందిన విషాద ఘటన మండలంలోని గన్నారంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివవరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి రజిత గంగాధర్ దంపతులకు ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు ఆడపిల్లలు కవలలుగా పుట్టగా అందులో అమూల్య పెద్దది. చిన్నారి ఇంటి ముందర ఆడుకుంటున్న సమయంలో నాగుపాము కాటు వేసింది. విషయయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. కాగా ఆ పామును స్థానికులు చంపేశారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి: తాడ్వాయికి చెందిన దూదేకుల జాకీర్ హుస్సేన్(44) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. జాకీర్ హుస్సేన్ బతుకు దె రువు కోసం దుబాయికి వెళ్లి వస్తుండేవాడు. ఇటీవల దుబాయి నుంచి తిరిగి వచ్చాడు. జాకీర్‌కు ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. కొన్ని నెలల క్రితం జాకీర్ కూతురు వేరే అబ్బాయిని ప్రేమ వివాహం చేసుకొని వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన జాకీర్ రోజు మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడుతుండేవాడు. బుధవారం రాత్రి బాగా మద్యం తాగి వచ్చి ఇంట్లో ఉన్న భార్య, కొడుకుతో గొడవ పడి వారిని కొట్టడంతో వారిద్దరు వేరే వాళ్ల ఇంట్లోకి వెళ్లి పడుకున్నారు. అనంతరం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రఫియా భేగం ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు

గాంధారి: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో కామారెడ్డికి చెందిన ఎండీ షఫీ మద్యం తాగి వాహనం నడిపినట్లు గుర్తించామన్నారు. ఆయనపై కేసు నమోదు చేశామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత, టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 8699691739. [T-1792]

■ వ్యక్తిగత,వ్యాపారం,వ్యవసాయ ఆస్తి, టేక్‌ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 94630 26237. [T-1801]

WANTED

■ Wanted Teachers to Teach Nursery to VII th (E/M) all Subjects. P.E.T., Incharge Vice Principal, Principal,Bodhan(m).Cont: 99483 78237. [Z-772202]

■ అనగా షాపింగ్ మాల్‌లో పర్మినెంట్‌గా పనిచేయుటకు 1).హెల్పర్స్ (Male/Female) 2).ఎలక్ట్రీషియన్ (అ:Diploma Electrician) కావలెను. ఆసక్తి గల వారు ID ప్రూఫ్ ఫొటోతో సంప్ర: అనగా షాపింగ్ మాల్, R.P రోడ్, NZB. [Z-772204]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233,6303955489. [M-1190657]

■ MEGA GROUP MAN POWER & Security సంస్థ విస్తరణలో భాగంగా AP & TS లలో జిల్లాల వారీగా ఈ ఫీల్డ్‌లో అనుభవమున్న వారికి ఫ్రాంచైజ్ ఇవ్వబడును. (పెట్టుబడి లేదు). సెల్ : 70326 10569, 70931 25169. [NA-5468]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్ : 9848571888. [H-793404]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795295]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.